పవన్ కల్యాణ్‌కు వలంటీర్ల నిరసన సెగ

- వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- పలుచోట్ల నిరసనలు, ధర్నాలు
- తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు


తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వలంటీర్లు


దుగ్గిరాల మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వలంటీర్లు

తాడేపల్లి రూరల్ : సినీ నటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వాఖ్యలపై వలంటీర్లు భగ్గుమన్నారు. వాడవాడలా నిరసనలు తెలిపారు. అనుచిత వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని వలంటీర్లు కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహిళా వలంటీర్లు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ చవకబారు మాటలు మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ గురించి పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించుకుంటున్నారంటే అది వలంటీర్ల వ్యవస్థ వల్లే అని ఆయన గుర్తించాలని హితవు పలికారు. అనంతరం కార్పొరేషన్ డెప్యూటీ కమిషనర్ శివారెడ్డికి పవన్ కల్యాణ్ వ్యాఖ్యల్ని నిరసిస్తూ వినతిపత్రం అందజేయడంతో పాటు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దుగ్గిరాల మండల కార్యాలయం వద్ద ...
దుగ్గిరాల మండల కార్యాలయం వద్ద ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణితో కలసి వలంటీర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లుగా పనిచేస్తున్న వారిలో 50 శాతం మంది దళితులేనని, ప్రజలకు సేవ చేస్తూ గౌరవ వేతనం తీసుకుంటున్న తమను పవన్ కల్యాణ్ అవమానకరంగా మాట్లాడటం దారుణమని ఖండించారు. ఆయన వలంటీర్లకు క్షమాపణచెప్పి ఆ మాటల్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), నాయకులు ఇత్తడి రమేష్, షేక్ జానీ బాషా, పలుకూరి శామ్యూల్, ఆళ్ల మహేష్, జమ్ముల రాకేష్, కాబోతు కర్ప్యూరావు, ఆత్మకూరు నాగేశ్వరరావు, మేదర సుధీర్, గోపి, దుగ్గిరాల గ్రామంలోని పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.


తాడికొండలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

పిచ్చి వ్యాఖ్యలు మానుకోపోతే బడితె పూజ తప్పదు
తాడికొండ: పవన్ కల్యాణ్ వలంటీర్లపై పిచ్చి వ్యాఖ్యలు మానుకోవాలని, లేకపోతే బడితె పూజ తప్పదని తాడికొండ గ్రామ వలంటీర్లు ధ్వజమెత్తారు. వలంటీర్ వ్యవస్థపై పవన్ వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం సాయంత్రం తాడికొండ బస్టాండ్ కూడలిలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ బాగుందని ప్రధాని సహా మెచ్చుకున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశ పెట్టేందుకు యోచిస్తుంటే పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు సిగ్గుచేటని ఖండించారు. ప్రజాసేవ చేసేందుకు ఉద్యోగం చేస్తున్న తమపై నిందలేస్తే రాష్ట్రంలో తిరగకుండా చెప్పులతో కొట్టడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి



వలంటీర్లను కించ పరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం పవన్ కల్యాణ్‌కు తగదు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి పని చేశాం. కుటుంబ సభ్యులు సైతం దూరంగా ఉన్నా కోవిడ్ రోగులకు సేవలందించాం. తాము జీతాలకు పని చేయడం లేదని, సేవా గుణంతో పని చేస్తున్నామనే విషయాన్ని పవన్ కల్యాణ్ తెలుసుకోవాలి. వలంటీర్ల గురించి మాట్లాడటానికి ఆయనకు ఏం హక్కుఉంది? కనీసం ఎమ్మెల్యే కూడా కాదు. వార్డు మెంబరు కూడా కానీ ఆయనకు వలంటీర్లను ప్రశ్నించే హక్కు ఎవరిచ్చారు?

– అనిత, వలంటీర్, నవులూరు

ఇంటర్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: పీడీఎస్‌యూ

తాడేపల్లి రూరల్ : ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి బైపాస్ రోడ్డు వద్ద గల ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా ఇంటర్ బోర్డు కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌కు వినతిప్రతం అందజేశారు. అనంతరం పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 439 ప్రభుత్వ, 132 ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల్లో నూటికి 70 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులేనని తెలిపారు. కాలేజీల్లో వీరంతా మౌలిక వసతులతో పాటు లెక్చరర్ల కొరత సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని పరిష్కరించాలని ఆయన కోరారు. సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యు. గనిరాజు, ఎల్. రాజశేఖర్ మాట్లాడుతూ పలు కార్పొరేట్ కాలేజీలు జేఈఈ, నీట్ పేరుతో లక్షల రూపాయల్ని ఫీజుల రూపంలో దోచుకుంటున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ కాలేజీల్లో ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రొఫెసర్ నీరదారెడ్డి, డాక్టర్ చక్రపాణి కమిటీ సిఫార్సుల్ని బుట్టదాఖలు చేశారని విమర్శించారు. ప్రైవేటు కాలేజీల ఫీజుల దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సునీల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి యస్. కిరణ్ కుమార్, నాయకులు భాను ప్రసాద్, ధర్నేష్, వైష్ణవ్, వెంకటేష్, రామకృష్ణ, రిషిత్, చక్రవర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళను వేధిస్తున్న యువకుడి అరెస్టు

ఫిరంగిపురం: ఓ మహిళని వేధిస్తున్న యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మస్తాన్‌వలి స్టూడియో నడుపుకుంటూ ఓ న్యూస్ చానల్‌లో రిపోర్టరుగా పనిచేస్తుంటాడు. ఈనెల 7న గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంటికి ఆమె భర్త లేని సమయంలో వెళ్లాడు. ఫొటోలు తీసి మాధ్యమాల్లో పెడతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. కాగా స్టూడియో వద్ద మస్తాన్‌వలి ఉన్నాడన్న సమాచారంతో మేడికొండూరు సీఐ వాసు సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. నరసరావుపేట రెండో ఏజేసీజే కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండుకు పంపారు.

కార్మెల్ మాత ఉత్సవానికి పటిష్ట భద్రత



ఫిరంగిపురం: కార్మెల్ మాత ఉత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తుళ్లూరు డీఎస్పీ పోతురాజు, మేడికొండూరు సీఐ వాసు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను వారు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ పోతురాజు మాట్లాడుతూ ఈనెల 14నుంచి ప్రారంభమయ్యే కార్మెల్ మాత ఉత్సవ ఏర్పాట్లు గురించి బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి, గుడిపెద్దలతో చర్చించినట్లు చెప్పారు. కొండ దిగువ, ఎగువ భాగంలో యాత్రికులకు చేస్తున్న ఏర్పాట్లు, వసతుల్ని పరిశీలించామన్నారు. భోజన ఏర్పాట్లపై పలు సూచనలు చేశామని, మెట్ల మార్గంలో రాత్రి పూట ఇబ్బంది కలగకుండా నిరంతరం విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని చెప్పామని పేర్కొన్నారు. మైకును ఏర్పాటు చేసి తప్పిపోయిన యాత్రికుల వివరాల్ని తెలియజేయాలని చెప్పినట్లు వివరించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పలు స్టేషన్ల నుంచి 150 మంది సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆదేశాలతో రప్పించి నియమిస్తున్నామని తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు కూడా కొన్ని ప్రదేశాలు సూచించామని చెప్పారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కట్టుదిట్టమైన భద్రతాఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మేడికొండూరు సీఐ వాసు, ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చేనేత వస్త్ర వ్యాపారులపై దాడి అమానుషం

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి: ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులపై అమానుషంగా దాడి చేసి దుర్భాషలాడిన విజయవాడకు చెందిన ఆలయ శిల్క్స్ యజమాని గుప్తాపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాపారానికి వస్త్రాలు తీసుకుని తిరిగి డబ్బు చెల్లించకపోగా వారిపై అమానుషంగా దాడి చేసి నిర్బంధించడం దారుణమని ఖండించారు. భవిష్యత్తులో చేనేత కార్మికులపై దాడులు జరగకుండా ప్రభు త్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ సంఘం నాయకులు జగ్గారపు శ్రీనివాస్, పారేపల్లి మహేష్, చిలుకోటి అంజిబాబు, వరద శ్రీనివాస్, వీరాంజనేయులు, గోలి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే చేయూత


మంగళగిరిలో చిరు వ్యాపారికి తోపుడు బండి అందజేస్తున్న పార్టీ నాయకులు


మోరంపూడిలో తోపుడు బండ్లను అందిస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, నాయకులు

మంగళగిరి: చిరు వ్యాపారికి ఎమ్మెల్యే ఆర్కే చేయూతనందించారు. నగరంలోని కొప్పురావు కాలనీకి చెందిన రాపోలు రమాదేవి జాతీయ రహదారి అనుకుని తోపుడు బండి అద్దెకు తీసుకుని టిఫిన్ వ్యాపారం నిర్వహిస్తోంది. ఆదాయంలో అద్దెకు అధికంగా చెల్లించాల్సి వస్తోందని స్థానిక నాయకులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన ఆయన తోపుడు బండి చేయించగా, దాన్ని సోమవారం పార్టీ నాయకులు రమాదేవికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, మహ్మద్ ఫిరోజ్, ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.

మోరంపూడిలో ముగ్గురికి ...
తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడిలో చిరు వ్యాపారం చేసుకుంటున్న వారికి తోపుడు బండ్లను మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి సహకారంతో సోమవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, సర్పంచ్ ఇత్తడి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అద్దె బండ్లపై చిరు వ్యాపారం చేసుకుంటున్న మంచికలపూడి సుబ్బారావుకు టిఫిన్ బండిని, మామూలూరి బాబూరావుకు తోపుడు బండిని, గౌరిగిపూడి సంసోనుకు బల్ల రిక్షా అవసరమని గుర్తించి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. స్పందించిన ఆయన వెంటనే వీటిని అందజేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు చలంచర్ల రామకోటిరెడ్డి, షేక్ జానీ బాషా, పలుకూరి సామ్యూల్, ఆత్మకూరి నాగేశ్వరరావు, కర్ప్యూరావు పాల్గొన్నారు.

ఉండవల్లిలో ట్రాఫిక్ జామ్



తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం సాయంత్రం గంటన్నర సమయం ట్రాఫిక్ నిలిచిపోయింది. స్కూల్, కాలేజీ బస్సులు ఒక్కసారిగా రావడంతో నాలుగు రోడ్ల కూడలిలో పూర్తిగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉండవల్లి సెంటర్ నుంచి మంగళగిరి వైపు పోలకంపాడు శివాలయం వరకు, అమరావతి వైపు అయ్యప్ప స్వామి గుడివైపు, ప్రకాశం బ్యారేజ్ వైపు హోసన్నా ప్రార్థన మందిరం వరకు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఉండవల్లి సెంటర్‌లో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడం, ఈ మధ్య కాలంలో తాడేపల్లి పోలీసులు రోడ్డు మధ్యలో డివైడర్లను తీసివేయడంతో సమస్య తలెత్తింది. వాహనదారులు ఇష్టం వచ్చినట్లు నడపడంతో ట్రాఫిక్ జామ్ అయింది. గంట అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి సమస్యను పరిష్కరించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


చిర్రావూరు రైతు భరోసా కేంద్రంలో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు


దుగ్గిరాల తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

తాడేపల్లి రూరల్ : రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు చిర్రావూరులో రైతు భరోసా కేంద్రంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభం దృష్ట్యా రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఎరువులు, పురుగు మందుల్ని సబ్సిడీపై అందజేయాలని కోరారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీం పంట కాలవలో విపరీతంగా మురుగు నీరు చేరడం వల్ల పంటలు పాడవుతున్నాయని తెలిపారు. చిర్రావూరులో 10 ఎకరాల వరకు పంట వేయలేదని వెల్లడించారు. కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, కొలనుకొండ గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలు అధిక వర్షాలకు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. ప్రాతూరు దగ్గర నుంచి అత్తలూరి పాలెం వరకు కృష్ణానది కట్టకు అనుకుని రివిట్‌మెంట్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి, నేతలు కాట్రగడ్డ శివన్నారాయణ, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి రాంబాబు, దోకుపర్తి రాజేంద్రబాబు, బొప్పన గోపాలరావు, పమిరిశెట్టి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాల్వ పూడిక వెంటనే తీయించాలి
తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి, దుగ్గిరాల ప్రాంతాల్లో రైల్వే 3వ లైన్ ఏర్పాటు చేసిన సందర్భంగా పంట కాల్వ పూడుకుపోయిందని, వెంటనే తీయించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జొన్నా శివశంకరావు ఆధ్వర్యంలో సోమవారం దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరికి, ఇరిగేషన్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే లైను ఏర్పాటు చేసేటప్పుడు మట్టిని కాల్వ పక్కన వేసేశారన్నారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాల కారణంగా పొలాల్లో నీరు నిలిచిపోవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే రైల్వే, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో కాలువ పూడిక తీయించాలని ఆయన కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, ముడి జింకు, పురుగు మందుల్ని సబ్సిడీపై అందజేయాలని ఏవోను కోరారు. రైతు సంఘం మండ ల అధ్యక్ష కార్యదర్శులు యోగేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు అమ్మి రెడ్డి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట


విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఎర్రబాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్థానిక దాత నాయుడు శ్రీనివాసరావు , ఆయన కుమారులు సహకారంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు,పెన్నులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రమ శిక్షణతో విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన దాతను అభినందించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన నాయకుడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్ని అభివృద్ధి చేయడం హర్షణీయమన్నారు. దాతలు అందించిన పుస్తకాల్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరేంద్ర కుమార్, విద్యా కమిటీ వైస్ చైర్మన్ సుజాత, సభ్యురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు సునీత, అరుణ్‌కుమార్, ఎం. ప్రసాద్, కె. ప్రసాద్, నీరజ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం



తాడేపల్లి రూరల్: కుల,మత, వర్గ తారతమ్యం లేకుండా ప్రజలకు సేవలందరించే సంస్థ రోటరీ అని భారత క్రికెటర్ అంబటి రాయుడు పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో సోమవారం సాయంత్రం ఓ ప్రైవేటు హోటల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు కిరణ్ పరుచూరి, కార్యదర్శి చంద్ర ఓబులారెడ్డి, కోశాధికారి గోవు నాగరాజు ఆధ్వర్యంలో కాఫీ విత్ అంబటి రాయుడు కార్యక్రమం నిర్వహించారు. రాయుడు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి చేస్తున్న సేవా కార్యక్రమాల్ని అభినందించారు. రోటరీ సేవల్లో తాను కూడా పాల్గొంటానని చెప్పారు. రోటరీ హానరరీ మెంబర్‌గా జాయిన్ చేసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం క్లబ్ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి మాజీ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి, రోటరీ సభ్యులు కాట్రగడ్డ శివన్నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, జొన్న రాజేష్, శ్రీకాంత్, రవీంద్రరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శంకరశెట్టి రమేష్, రావూరి రమేష్ బాబు, బుల్లిబాబు, నాగార్జునరెడ్డి, శ్రీలత, నాగ కిరణ్, పీడీజీ అన్నే రత్న ప్రభాకర్, మంగళగిరి రోటరీ క్లబ్ సభ్యులు అనిల్ చక్రవర్తి, రేవంత్, గాజుల శ్రీనివాస్, సతీష, అందే మురళి పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో పారదర్శకత అవసరం


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి


పాల్గొన్న బీఎల్‌వోలు, వివిధ విభాగాల ప్రభుత్వ సిబ్బంది

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి

తాడికొండ: బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి కచ్చితమైన సమాచారాన్ని సేకరించి ఎలాంటి లోపాలు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎం. వెంకట శివరామిరెడ్డి ఆదేశించారు. తాడికొండ షిర్డీసాయి బాబా కల్యాణ మండపంలో సోమవారం బీఎల్‌వోలకు ఓటరు జాబితాపై ఏర్పాటు చేసిన శిక్షణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చనిపోయిన వారి ఓట్లను మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత కుటుంబ సభ్యుల నుంచి సంతకం సేకరించి తొలగించాలని చెప్పారు. స్థానికంగా నివాసం ఉండని, వలస కూలీలు కుటుంబాలకు సంబంధించి పూర్తిస్థాయి విచారణ జరిపిన తరువాతే ఓట్లు తొలగింపులు, చేర్పులు చేయాలని సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా పరిగణనలోకి తీసుకోవద్దని ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఇంటింటికీ డోర్ టు డోర్ సర్వే చేయాలని సూచించారు. ఇంటి నంబర్ లేకుండా ఓటరు జాబితాలో పేర్లు ఉన్న పక్షంలో పూర్తి చేయాలని, మరెక్కడైనా ఓటు ఉందో అనేది పరిశీలించి కచ్చితమైన అడ్రస్ పొందు పరచాలని తెలిపారు. వచ్చేది ఎన్నికల ఏడాది కావడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పొరపాట్లు లేకుండా నూరుశాతం ఓటు మార్పులు చేర్పులు జరగాలని చెప్పారు. కార్యక్రమంలో తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల తహసీల్దార్లు జీవీఎస్ ఫణీంద్రబాబు, శ్రీనివాసశర్మ, పద్మనాభుడు, పలు ప్రభుత్వ విభాగాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మంగళగిరి నియోజకవర్గానికి నిధుల వరద

- ఇప్పటికే ఎంటీఎంసీకి రూ. 130 కోట్లు మంజూరు
- తాజాగా దుగ్గిరాల మండలానికి రూ. రూ 50 కోట్లు
- నందివెలుగు–మంగళగిరి రహదారి అభివృద్ధికి రూ 6.5 కోట్లు కేటాయింపు
- రాష్ట్రానికే ఆదర్శంగా మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి
- శరవేగంగా కొనసాగుతున్న పనులు


అభివృద్ధికి నోచుకోనున్న మంగళగిరి–నందివెలుగు రోడ్డు


మంగళగిరి: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో నిధులు వరదలెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి నివాసం ఉండటంతో ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తాజాగా మరిన్ని నిధులు కేటాయింపుతో రాష్ట్రానికే ఆదర్శంగా మారనుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం రూ. 130 కోట్లు కేటాయించిన ప్రభుత్వం తాజాగా దుగ్గిరాల నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పనులకు రూ. 50 కోట్లు కేటాయించింది. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోక, గోతులమయంగా మారి రవాణాకు ఇబ్బందిగా ఉన్న మంగళగిరి– నందివెలుగు రోడ్డు అభివృద్ధికి రూ. 6.50 కోట్లు మంజూరు చేసింది.

అద్దంలా రోడ్లు
ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ. 103 .84 కోట్లతో 93.92 కిలోమీటర్ల బీటీ, సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు పూర్తికాగా.. మరో 30 కోట్లతో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ. 22 కోట్లతో గౌతమ బుద్ధా రోడ్డు విస్తరణ పూర్తయింది. గ్రామాల్లో మరో రూ. 23 కోట్లతో చేపట్టిన నిడమర్రు– తాడికొండ రోడ్డు 16 కిలోమీటర్లు, రూ. 12 కోట్లతో చేపట్టిన దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు నుంచి సీతానగరం వరకు ఆరు కిలోమీటర్లతో పాటు రూ. 8.36 కోట్లతో మరో ఐదు రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలో 63 కిలోమీటర్ల మేర రూ. 52 కోట్ల ఆర్ అండ్ బీ నిధులతో రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

చేనేత పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట
చేనేత పెట్టింది పేరైన మంగళగిరి చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రత్యేక దృష్టి సారించి, అభివృద్ధి పనులు చేపట్టారు. రూ. 4 కోట్లతో పాత బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న చేనేత భవనం తుది దశకు చేరుకుంది. సొంత మగ్గాలు లేక ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికులకు రాజీవ్ గృహకల్ప వద్ద రూ 2.40 కోట్లతో చేపట్టిన మగ్గం షెడ్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల కోసం ప్రత్యేక పనులు చేపట్టారు.

సామాజిక భవనాలు
నగరంలోని ఆయా సామాజికవర్గాలలోని పేదలు శుభకార్యాలు, ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు చేపట్టిన సామాజిక భవనాల నిర్మాణం పూర్తి కావస్తున్నాయి. ఇప్పటికే కొన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ. 50లక్షల నుంచి రూ. 75 లక్షలు ఖర్చు చేస్తున్నారు. దీంతో ఆయా సామాజికవర్గాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయిస్తుండడంతో రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ


సిబ్బందితో మాట్లాడుతున్న మలేరియా అధికారి సుబ్బరాయణం

మేడికొండూరు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం తెలిపారు. మండలంలోని డోగిపర్రు ఎస్సీ కాలనీలో సోమవారం ఆయన పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత, డ్రెయిన్లు, నీటి నిల్వలను పరిశీలించారు. గత నెలలో కాలనీలో కొందరికి మలేరియా జ్వరాలు ప్రబలడంతో కాలనీని పరిశీలించడానికి ఆయన వచ్చారు. ఎవరికైనా జ్వరాలు ఉన్నాయా ? అని నివాసితుల్ని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అపరిశుభ్రత వాతావరణం వల్ల నష్టాల్ని వివరించారు. సర్వే చేసి జ్వరం అనుమానాలున్న వ్యక్తుల నుంచి రక్త నమూనాలు సేకరించాలని స్థానిక వైద్య సిబ్బందికి సూచించారు. జ్వరం లక్షణాలున్న వారికి మందులు పంపిణీ చేశారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు శ్రీనివాసరావు,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.